www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 22 డిసెంబరు 2022

5

పశ్చిమ గోదావరి



పోలీస్ కస్టడీకి సబ్ రిజిస్ట్రార్ జీవన్‌బాబు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ జీవన్‌బాబును బుధవారం పోలీస్ కస్టడీకి తీసుకున్నారు. ఇక్కడ నిషేధిత జాబితాలోని భూములు, ప్రభుత్వ భూములు రిజిస్ట్రేషన్ చేసిన సంఘటనపై గత నెలలో నమోదైన కేసులో ఆయన సబ్ జైల్లో ఉన్నారు. విచారణలో భాగంగా ఆయనను ఒకరోజు పోలీస్ కస్టడీలోకి తీసుకుని తిరిగి సాయంత్రానికి కోర్టుకు హాజరు పర్చామని సిఐ వాడపల్లి సురేష్ బాబు తెలిపారు.



జీవన్‌బాబు (ఫైల్‌ఫోటో)

అగ్నికీలలు.. ఆర్తనాదాలు



ఎగసిపడుతున్న అగ్నికీలలు

దగ్ధమైన ప్లాంట్

గాయపడిన చరణ్

గాయపడిన దుర్గాప్రసాద్

క్షతగాత్రుణ్ని ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

ఫోరస్ ఘటనను తలపించిన ఫుడ్‌ఫ్యాట్స్ ప్రమాదం

ఐదుగురు కార్మికులకు గాయాలు : మరొకరి ఆచూకీ గల్లంతు

ఎగసిన మంటలతో తాడేపల్లిగూడెం ప్రాంతవాసులు బెంబేలు

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన మంత్రి కారుమూరి, అధికారులు

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి : సిఐటియు

సమయం మధ్యాహ్నం మూడు గంటలు.. గంట క్రితమే విధుల్లోకి వచ్చిన కార్మికులంతా తమ పనుల్లో బిజీగా ఉన్నారు.. ఒక్కసారిగా భారీ పేలుడు.. ఎగసిపడిన అగ్నికీలలు.. తేరుకునేలోపు ఫ్యాక్టరీని చుట్టుముట్టిన మంటలు.. కార్మికులంతా ఉరుకులు..పరుగులు.. అరుపులు.. కేకలు.. ఇదీ తాడేపల్లిగూడెం పట్టణ శివారులోని పెంటపాడు మండలం ప్రతిపాడు గ్రామ పరిధిలో ఫుడ్‌ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీలోని ఎస్ఎఫ్-1 సాల్వెంట్ ప్లాంట్‌లో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ప్రమాదం తీరు. ఈ ప్రమాదానికి సంబంధించి ప్రత్యక్ష సాక్షులు, పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు, కార్మికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం/ఉంగుటూరు

ఫుడ్‌ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్‌లో బుధవారం మధ్యాహ్నం కార్మికులు రెండో షిఫ్టులో చేరిన కొద్దిసేపటికే ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. పరిశ్రమలోని ఎస్ఎఫ్-1 సాల్వెంట్ ప్లాంట్‌లో మధ్యాహ్నం 3.20 గంటలకు పేలుడు సంభవించి మంటలు ఎగసిపడ్డాయి. దీంతో పరిశ్రమలో ఇతర విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు, తాడేపల్లిగూడెం ప్రాంతవాసులు ఉలిక్కిపడ్డారు. మంటలు ఉధృతంగా ఎగసిపడటంతో అటువైపు ఎవరూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఆ ప్లాంట్‌లో పని చేస్తున్న ఆరుగురిలో ఐదుగురు కార్మికులు గాయాలతో బయట పడగా మరొకరి ఆచూకీ గల్లంతైంది.

సాల్వెంట్ ప్లాంట్‌లో కార్మికులు మూడు షిఫ్టులుగా పని చేస్తారు. మధ్యాహ్నం షిఫ్టులో తాడేపల్లిగూడేనికి చెందిన కె.చరణ్ (32), అలంపురానికి చెందిన తాళ్లూరి దుర్గాప్రసాద్ (30), తణుకుకు చెందిన కోన నాగబాబు (41), జగన్నాథపురానికి చెందిన గద్దం బాబ్జి (32), జగ్గంపేటకు చెందిన సునీల్‌కుమార్ గాయాల పాలయ్యారు. వీరిలో చరణ్, దుర్గాప్రసాద్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం రాజమండ్రి తరలించారు. కుంచనపల్లికి చెందిన మల్లికార్జునరావు ఆచూకీ తెలియాల్సి ఉంది. ఈయన పేలుడు సంభవించిన ప్రాంతానికి అతి సమీపంలో ఉండటంతో ప్రమాదం నుంచి బయటపడే అవకాశం లేదని అంటున్నారు. ఆ ప్లాంట్‌లో ఇన్సులేషన్ పని చేస్తున్న ఏడుగురు కార్మికులు పేలుడు సమయానికి కొన్ని నిమిషాల ముందు టీ తాగేందుకు వెళ్లడంతో వారు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద విషయం తెలియగానే తాడేపల్లిగూడెం అగ్నిమాపక శాఖ సిబ్బంది రంగంలోకి దిగి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే సాయంత్రం కావడం, చీకటి అలుముకోవడం, ప్రమాదం సంభవించిన ప్లాంట్ కుప్పకూలే ప్రమాదం ఉండటంతో ఎవరూ లోపలికెళ్లకుండా ఆ ప్రాంతాన్ని సీజ్ చేశారు. సమాచారం తెలియగానే రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో పాటు కార్మికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, ఆర్‌డిఒ దాసి రాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఆ ప్లాంట్ వద్దకు ఎవరూ వెళ్లకుండా సీల్ వేశామని, గురువారం ఉదయం సంబంధిత శాఖల అధికారులు, ఫోరెన్సిక్ నిపుణుల సాయంతో ప్లాంట్‌లోకి వెళ్లి ఆచూకీ తెలియని కార్మికుని గురించి, ప్రమాదానికి గల కారణాలపై విచారణ సాగిస్తామని వారు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తనయుడు కొట్టు విశాల్ పరిశీలించారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి : సిఐటియు

ఫుడ్‌ఫ్యాట్స్ పరిశ్రమలో ప్రమాద ఘటనలో గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. వారు ప్రమాదస్థలాన్ని సందర్శించి కార్మికులతోను, ఫ్యాక్టరీ యాజమాన్యంతోనూ, అధికారులతోనూ మాట్లాడారు. ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి కారణాలు గుర్తించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆచూకీ తెలియకుండా పోయిన కార్మికుని వివరాలు వీలైనంత త్వరగా తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

పరిశ్రమల్లో ప్రమాద ఘంటికలు

ఏలూరు జిల్లాలోని ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెంలోని పోరస్ కంపెనీలో కొన్ని నెలల క్రితం పేలుడు సంభవించి 12 మంది కార్మికులు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ఫుడ్‌ఫ్యాట్స్‌లో బుధవారం చోటుచేసుకున్న ప్రమాదంతో కార్మికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పరిశ్రమలో పని చేయడానికి తమ వారు ఎలావెళ్తారోనని కార్మికుల కుటుంబ సభ్యులు పెద్దసంఖ్యలో పరిశ్రమ వద్దకు పరుగులు తీశారు. ఒక కార్మికుని ఆచూకీ తెలియకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు తల్లడిల్లుతున్నారు. అదే సమయంలో రాజమండ్రి తరలించిన చరణ్, దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులు కూడా ఆందోళనకు గురవుతున్నారు. మొగల్తూరులో ఆనంద రొయ్యల పరిశ్రమలో కార్మికుల మృత్యువాత తర్వాత పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటూ కార్మికులు మృత్యువాత పడటం సర్వత్రా ఆందోళన కల్గిస్తోంది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లుగా మార్చడంతో పరిశ్రమలపై పర్యవేక్షణ సంబంధిత శాఖల నుంచి పూర్తిగా కొరవడింది. ఫలితంగా వరుసగా కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్

ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటా

జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకొల్లు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పాలకొల్లు నియోజకవర్గం నుంచి తాను ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ప్రకటించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం జగన్ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. జెడ్‌పి ఛైర్మన్ పదవికీ రాజీనామా చేస్తానని ప్రకటించారు. తొలుత రాష్ట్రంలో మళ్లీ మనమే గెలుస్తామని చప్పట్లు కొట్టాలని కార్యకర్తలను కోరగా స్పందన రాకపోవడంతో ఆయన ఈ సంచలన ప్రకటన చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్, ఎంపిపిలు రావూరి వెంకట రమణ, సుమంగళి, జెడ్‌పిటిసిలు నడపన గోవిందరాజు, గుంటూరు పెద్దిరాజు, గుణ్ణం నాగబాబు, అడబాల వెంకటరమణ, చందక సత్తిబాబు, గాదె వెంకన్న పాల్గొన్నారు.

కోడిపందేల నిరోధానికి ప్రజల్లో అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో కోడి పందేలను నిర్వహించకుండా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి కోడిపందేల నిరోధంపై డివిజన్, మండలస్థాయి అధికారులతో ఆమె బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో కోడిపందేలు జరగడానికి వీల్లేదని, ఒకవేళ పందేలు నిర్వహిస్తే విధించే శిక్షలపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించాలని అన్నారు. డివిజన్, మండల, గ్రామస్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ కమిటీలో గ్రామ మహిళా సంరక్షణ అధికారి, విఆర్ఒ, మండల కమిటీలో ఎస్‌హెచ్ఒ, తహశీల్దార్, సచివాలయ సెక్రటరీ, డివిజనల్ స్థాయి కమిటీలో డిఎల్‌పిఒ, ఎస్‌డిపిఒ, సబ్ కలెక్టర్ లేదా ఆర్‌డిఒ ఉంటారని తెలిపారు. డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి కోడి పందేల నిర్వహణపై సమాచారాన్ని సేకరించి నిరోధించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు. పండుగ దినాల్లో కోడి పందేల నిరోధానికి 144 సెక్షన్ అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత ఏడాది కోడి పందేలకు స్థలాలిచ్చిన యజమానులను గుర్తించి ముందుగా నోటీసులు జారీ చేయాలన్నారు. నిబంధనలను అతిక్రమించి పందేలు జరిగితే గ్రామ, మండల కమిటీలను బాధ్యులుగా చేస్తామని హెచ్చరించారు. షాపుల ముందు, రోడ్లపై బహిరంగంగా మద్యం తాగితే చర్యలుంటాయని తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, వినియోగంపై ఎక్సైజ్ శాఖ తగు అప్రమత్తతతో పనిచేయాలని సూచించారు.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

తేమశాతం పేరుతో మిల్లర్ల దోపిడీ అరికట్టాలి

ఎపి కౌలురైతుల సంఘం

ప్రజాశక్తి - పోడూరు

ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసినట్లు చెబుతున్నా మిల్లర్ల దోపిడీ నిరాటంకంగా సాగుతోందని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. ధాన్యం కొనుగోలు, తేమశాతం తదితర సమస్యలపై బుధవారం మండలంలోని రావిపాడు, గుమ్ములూరు, రావిగొప్ప గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ధాన్యం తేమశాతం రైతుభరోసా కేంద్రాల్లో కంటే మిల్లర్ల దగర మూడు నుంచి ఐదు పాయింట్ల వరకూ తేడా వస్తోందని, ప్రతి బస్తాకూ రూ.60 నుండి రూ.100 వరకు మిల్లర్లు తమ వద్ద నుంచి వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారన్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం చేసి తేమశాతం పేరిట సాగుతున్న దోపిడీని అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కౌలు రైతులు అధికారి గంగాచలం, నేలపాటి సుబ్బారావు, గుబ్బల వెంకటేష్, దొంగ రాంబాబు, కుడిపూడి ఏసుబాబు, వేండ్ర రాఘవులు, మాండ్రు దాసు, నల్లి రామారావు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కౌలు రైతు సంఘం నేతలు

రైల్వేస్టేషన్లో సౌకర్యాలు కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకు రైల్వేస్టేషన్లో ప్రయాణికులకు కావాల్సిన సౌకర్యాలు వెంటనే కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్టేషన్‌లో డిస్‌ప్లే బోర్డులు వెంటనే ఏర్పాటు చేయాలని, ప్రయాణికుల సౌకర్యార్థం లిఫ్ట్ ఏర్పాటు చేయాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని, లోకల్ రైళ్లు పెంచాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ తణుకు రైల్వేస్టేషన్ కనీస సౌకర్యాలు లేకపోవడం బాధాకరమన్నారు. ఇటీవల స్టేషన్ విస్తరించినప్పటికీ లిఫ్ట్ లేకపోవడం వల్ల పెద్ద వయస్సు, అనారోగ్యంతో ఉన్నవారు మెట్లు ఎక్కలేక పట్టాల పైనుంచి రావడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. రాజమండ్రి నుండి విజయవాడ లోకల్ ట్రైన్స్ సంఖ్య భారీగా పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గార రంగారావు, పి.దక్షిణామూర్తి, శర్మ, ధనలక్ష్మి, ఆర్ఎస్.యామిని, మానస, ఉమా, ఎమ్‌డి.శిరీష, వి.కుమారి, భవాని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

23న ఆర్థిక మాంద్యం-పరిష్కారాలపై సెమినార్

ప్రజాశక్తి - భీమవరం

సిఐటియు ఆధ్వర్యాన 'ప్రపంచ ఆర్థిక మాంద్యం-కారణాలు-పరిష్కారాలు' అంశంపై ఈనెల 23న జిల్లాస్థాయి సెమినార్‌ను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 1970లో దేశవ్యాప్తంగా ఏర్పడిన సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ భీమవరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 52 ఏళ్లలో తొలిసారి రాష్ట్ర మహాసభను భీమవరం పట్టణంలో నిర్వహించనున్నామన్నారు. కార్మికుల సమస్యలపై మాత్రమే కాకుండా ఉద్యోగులు, నిరుద్యోగులు, మహిళలు, కర్షకులు, చిరు వ్యాపారుల సమస్యలపై అలుపెరగని ఐక్య ఉద్యమాలు చేపడుతుందన్నారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని రాయ్ విజ్ఞప్తి చేశారు. దీనిలో భాగంగా జిల్లావ్యాప్తంగా ముఖ్యమైన పట్టణాల్లో వివిధ అంశాలపై సదస్సులు, చర్చా గోష్టులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. 1991 తర్వాత నూతన ఆర్థిక విధానాల వల్ల దేశంలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభంపై, నేడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆర్థిక మాంద్యం ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా ఈ నెల 23న 'ప్రపంచ ఆర్థిక మాంద్యం-కారణాలు-పరిష్కారాలు' అంశంపై జిల్లాస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్య వక్తగా ప్రముఖ రచయిత, మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ హాజరవుతారని చెప్పారు. పట్టణంలోని వివిధ అసోసియేషన్లు, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు పాల్గొంటారని తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ ప్రస్తుతం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. వ్యాపారాలు సన్నగిల్లుతూ కంపెనీలు మూతపడటం వల్ల నిరుద్యోగం రోజురోజుకీ మరింత పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలన్నింటిపై రాష్ట్ర మహాసభలో చర్చించనున్నామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, జిల్లా కార్యదర్శులు మల్లిపూడి ఆంజనేయులు, అల్లూరి అరుణ్, పట్టణ పౌరుల సమాఖ్య జిల్లా కన్వీనర్ వైకుంఠరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: భీమవరంలో జరగనున్న సిఐటియు రాష్ట్ర మహాసభను, జనవరి రెండో తేదీన జరగనున్న ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, కోరాడ వెంకటేశ్వరరావు, మెట్రేడ్డి రమణ, చిటికిన రాము, పైలు పైడిమర్రి, కుంచంగి నానాజీ, పులిమంతుల రమణ, ఏపూరి శ్రీను పాల్గొన్నారు.

భీమవరం రూరల్: సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం వెంప బస్టాండ్ సెంటర్లో సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో విజయకుమార్, కోడి సత్యనారాయణ, గుత్తుల సత్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపాలన్, రాజారామ్మోహన్‌రాయ్, వాసు

అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ముఖ్యమంత్రి లక్ష్యం

జిల్లాలో సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సంక్షేమ అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ పనిచేస్తున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం ప్రసాదరాజు ఆధ్వర్యంలో సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో వివిధ సేవా కార్యక్రమాలు చేశారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి కౌన్సిలర్ బర్రి జయరాజుతో పాటు పలువురు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ ప్రసాదరాజు మాట్లాడారు. రాష్ట్ర యువ ముఖ్యమంత్రిగా జగన్ చరిత్ర సృష్టిస్తున్నారన్నారు.

తణుకు : సిఎం జన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు తణుకులో స్థానిక వైసిపి కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాగేశ్వరరావు కేక్‌కట్ చేసి జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రెడ్‌క్రాస్ సంస్థలు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించి దాతలకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో మంచి ఆదరణ వస్తోందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తణుకులో కేక్‌కట్ చేస్తున్న మంత్రి కారుమూరి

పాలకొల్లు : జగన్ పుట్టినరోజు సందర్భంగా వైసిపి కార్యాలయంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ భారీ కేక్ కట్ చేశారు. రక్తదాన శిబిరంలో ఆయన రక్తదానం చేశారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ రక్తదాన శిబిరం నిర్వహించి వృద్ధులకు, మహిళలకు చీరలు, దుప్పట్లు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ముందుగా భారీ కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఎస్‌సి కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, ఎఎంసి ఛైర్మన్ పెండ్ర వీరన్న పాల్గొన్నారు.

ఆకివీడు: ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చిన నాయకులు ముఖ్యమంత్రి జగన్ ఒక్కరే అని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా ఆకివీడులో కేకు కట్ చేసి పేదలకు మిఠాయిలు పంపిణీ చేశారు. కుప్పనపూడి, అంకోడుపేటలో వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. చినకాపవరం, దుంపగడప గ్రామాల్లో కేక్‌లు కట్ చేశారు. ఐ.భీమవరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మండల నాయకుడు కనుమూరు ఆనంద వర్మ వేలాదిమంది సహకారంతో పివిఎల్ నరసింహరాజు మహిళలకు చీరల పంపిణీ చేశారు. వాలంటీర్లకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : శివదేవుని చిక్కాలలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ కేక్ కట్ చేసి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం అమూల్ జగనన్న పాలవెల్లువ పథకాన్ని ప్రారంభించారు. అలాగే ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్‌ను ప్రారంభించి, ఈ పథకం ద్వారా పాడి రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సంఘాని వెంకటేశ్వర్లు, పశు వైద్యులు డాక్టర్ ప్రసాద్, సర్పంచి దిడ్ల మణి వజ్రం పాల్గొన్నారు. లంకల కోడేరులో జెడ్‌పి ఛైర్మన్ కేకు కట్ చేసి విద్యార్థులకు పంచారు. అనంతరం ఎనిమిదో తరగతి విద్యార్థులకు టాబ్‌లు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎవిఎస్‌వి ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు జయప్రసాద్‌రావు, వైస్ ఎంపిపి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అత్తిలి : అత్తిలి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణ మండపంలో జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పేదలకు, వృద్ధులకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, కలెక్టర్ పి.ప్రశాంతి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు పాల్గొన్నారు.

పాలమూరులో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - పెనుమంట్ర

హైస్కూల్ వెనుక డ్రెయినేజీ నిర్మించి మురుగుకాలువకు డ్రెయినేజీ నీరు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మూడో రోజు పాలమూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ హైస్కూల్ వెనుక డ్రెయినేజీని నిర్మించి పైపులైన్ల ద్వారా మురుగుకాలువకు నీరు పారుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కాకర రాజేశ్వరరావు, ఉపసర్పంచి కలిదిండి భాస్కర సత్యనారాయణరాజు, ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి), సొసైటీ అధ్యక్షుడు కలిదిండి సుబ్రహ్మణ్యం రాజు, తహశీల్దార్ దండు వెంకట సత్య సూర్య అశోక్ వర్మ పాల్గొన్నారు.

పెనుగొండ : పెనుగొండ పరిధిలో బుధవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించి గ్రామస్తులను సమస్యలడిగి తెలుసుకున్నారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజు

భీమవరానికి కార్పొరేట్ కంపెనీలు

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రంలోనే భీమవరానికి ఒక ప్రత్యేకత ఉందని, విద్య, వైద్యం, బులియన్, వస్త్ర, ఆక్వా రంగాలకు భీమవరం పెట్టింది పేరని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ముంబైకు చెందిన సెవెన్ హెవెన్స్ కార్పొరేట్ బేకరీ కంపెనీ బ్రాంచిను టు టౌన్‌లో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడేళ్లలో కార్పొరేట్ కంపెనీలు భీమవరం తరలివచ్చేందుకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో భీమవరం పట్టణాన్ని మెట్రో సిటీ తరహాలో మరిన్ని కార్పొరేట్ కంపెనీలకు స్వాగతం పలుకుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేకరీ బ్రాంచి యజమానులు ఆరిఫ్, అరుణ, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్‌పిటిసి పాల్గొన్నారు.



కోమటిగుంటలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహిస్తున్న నేతలు

'టిడిపికి మద్దతు తెలపాలి'

ప్రజాశక్తి - కాళ్ల

రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ టిడిపికి మద్దతు తెలపాలని టిడిపి తెలుగు యువత అధ్యక్షులు మంతెన నాగ ఆంజనేయులు కోరారు. కోమటిగుంటలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం టిడిపి గ్రామ అధ్యక్షులు యలమంచిలి వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్ పరిపాలనలో ప్రజలు ఎలాంటి కష్టాలు పడుతున్నారో తెలుస్తోందన్నారు. ఈ కార్యక్రమం గ్రామస్తులతో కలిసి రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ నాయకులు యలమంచిలి గణపతి, గుర్రం సత్యనారాయణ, సానపతి పాండు రంగారావు, చిటికెన కోడి నాగులు పాల్గొన్నారు.

'వైసిపి దళిత వ్యతిరేక ప్రభుత్వం'

ప్రజాశక్తి - పెనుమంట్ర

సిఎం జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఎస్‌సి, ఎస్‌టిలకు షాక్ ఇవ్వాడని టిడిపి నియోజకవర్గ యువ నాయకులు సిర్రా బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. జగ్జీవన్ జ్యోతి పథకం కింద రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టిలకు నెలకు 200 యూనిట్ల వరకూ విద్యుత్ ఇచ్చేవారని అయితే నేడు లబ్ధిదారుల సంఖ్యలో ప్రభుత్వం కోత పెట్టిందని తెలిపారు. అనర్హ పేరుతో సర్వే చేయించడం సిగ్గుచేటన్నారు. మొత్తం లబ్ధిదారుల్లో 17.5 శాతం ఉచిత విద్యుత్‌కు దూరమయ్యారనారు. దళిత వ్యతిరేక వైసిపి ప్రభుత్వాన్ని త్వరలో గద్దెదించాలన్నారు.

ఎస్‌కెఎస్‌డిలో కంప్యూటర్ ఫెస్ట్

ప్రజాశక్తి - తణుకురూరల్

ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల యుజి, పీజీ (అటానమస్)లోని కంప్యూటర్ విభాగం వారు ఈనెల 26న చార్లెస్ బాబేజ్ జయంతిని పురస్కరించుకుని బుధవారం కళాశాలలో కంప్యూటర్ ఫెస్ట్‌ను జాతీయ స్థాయిలో నిర్వహించారు. ఈ ఫెస్ట్‌లో సుమారు 250 మంది విద్యార్థులు పలు కళాశాల నుండి పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్ పాయింట్ ప్రజంటేషన్, గ్రూప్ డిష్కషన్, జామ్, ఠి కోడింగ్ పోటీలను నిర్వహించామన్నారు. గెలుపొందిన విద్యార్థినులను కళాశాల ప్రెసిడెంట్ సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, ఎ. డి.సుబ్బారావు, కన్వీనర్ వి.ఆయఖ్‌కుమార్, యు.లక్ష్మీ సుందరీబాయ్ అభినందించారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రామకృష్ణ

టిడిపి బలోపేతానికి కృషి చేయాలి : పితాని

ప్రజాశక్తి - పెనుమంట్ర

టిడిపి బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. బుధవారం నెగ్గిపూడి, ఓడూరు గ్రామాల్లో బూత్ కన్వీనర్లు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పితాని సత్యనారాయణ విచ్చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి (బుల్లులు), నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు వెలగల బుల్లి రామిరెడ్డి, ఆచారి పాల్గొన్నారు.

ఇద్దరు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - మొగల్తూరు

పేరుపాలెంసౌత్‌లో పేకాట స్థావరంపై బుధవారం దాడి చేశామని ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు. ఈ దాడిలో ఇద్దరు పేకాటరాయుళ్లను అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.4,300 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరం గ్రామం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. కైకలూరు మండలం పెదరామవరం గ్రామానికి చెందిన గరికిముక్కుల రాజువర్మ (22) భీమవరం మండలం కొవ్వాడ గ్రామంలో ఉన్న తన మేనత్త ఇంటికి క్రిస్మస్ పండుగకు రావాలని పిలవడానికి వెళ్లాడు. మంగళవారం రాత్రి మేనత్త ఇంటి నుంచి బయలుదేరి భీమవరం- ఉండి జాతీయ రహదారిలో ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా పెదఅమిరం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. గాయాలపాలైన రాజువర్మను భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేసరికి రాజువర్మ మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచినట్లు తెలిపారు.

ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని..

కుటుంబం వెలి..!

ప్రజాశక్తి - ఉండి

ప్రేమించి పెళ్లి చేసుకున్నాడనే నెపంతో ఒక కుటుంబాన్ని దాదాపు 6 సంవత్సరాలుగా వెలి వేసిన సంఘటన చినపుల్లేరు గ్రామంలో వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ కె.గంగాధర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. కోనాల దుర్గాభవాని, ఏసేబు ప్రేమించుకున్నారు. 2016లో వేరే చోట పెళ్లి చేసుకున్నారు. ఆర్థిక తరువాత ఏసేబు సొంత గ్రామమైన చినపుల్లేరు ఊరులోకి లూథరన్ చర్చి సంఘ పెద్దలైన భలే కృపావరం, చేగ సంసోను, సోదాసి అనిల్ కుమార్, బొంద యోనా, సోదాసి హనోక్, బొంద రత్నరాజు, మత్రి సంసోను తమకు తెలియకుండా వేరే గ్రామంలో పెళ్లి చేసుకున్నందుకు సంఘంలో నివసించాలంటే రూ.40,000 అపరాధ రుసుం కట్టాలని, లేనిపక్షంలో ఇక్కడ నివసించడానికి వీల్లేదని చెప్పారు. దీంతో దుర్గా భవాని, ఏసేబు దంపతులు ఏంచేయాలో తెలియక, డబ్బు లేక సంఘ పెద్దల కాళ్లు వేళ్లు పడి బతిమిలాడారు. వారు కనికరించకపోగా వీరిపై మరింత కక్ష సాధించి మీ కుటుంబ సభ్యులు మా చర్చికి వచ్చే ఉకుడడానికి లేదని చెప్పారు. మా సంఘస్తులెవరూ మీ ఇంటికి రారు, మీతో మాట్లాడరని నిబంధన పెట్టారు. డబ్బు కట్టని కారణంగా సంఘం నుండి వెలివేస్తున్నామని చెప్పారు. చేసేది లేక వారు ఉండి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల మనిషి అని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సిఎం పుట్టినరోజు వేడుకలు బుధవారం పట్టణంలోని త్యాగరాజు భవనంలో ఎంఎల్ఎ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జరిగాయి. ముందుగా జిల్లా ఎస్‌పి రవిప్రకాష్, ఎంఎల్ఎ గ్రంధి నియోజకవర్గ స్థాయి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం భారీ కేక్‌కట్ చేసి ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. తదనంతరం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలు అండగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్‌పిటిసి సభ్యులు కె.నరసింహరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు పాల్గొన్నారు.

మొగల్తూరు: ముఖ్యమంత్రి జగన్ పుట్టినరోజు సందర్భంగా మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్లో అభిమానులు ఏర్పాటు చేసిన కేకును జెడ్‌పిటిసి తిరుమాని బాపూజీ, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉపసర్పంచి బోనం నరసింహారావు, డి.దొరబాబు, కుక్కల కృష్ణమోహన్, బాలం నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. రామాలయం సెంటర్లో బాపూజీ టైలర్స్ అసోసియేషన్ సభ్యులు సిఎం పుట్టినరోజును నిర్వహించారు సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ కేక్‌కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బొల్లా రాము, పడవల నారాయణరావు పాల్గొన్నారు.

ఉండి : సిఎం జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆరేడులో వైఎస్ఆర్ విగ్రహానికి, పిహెచ్‌సి వద్ద మదర్ థెరిస్సా, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు కేక్‌కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు తినిపించారు. అనంతరం వృద్ధులు, పేదలకు పండ్లు, చీరలు పంపిణీ చేశారు. అలాగే రోగులకు పండ్లు, పాలు అందజేశారు. కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు పెన్మెత్స ఆంజనేయరాజు, జెడ్‌పిటిసి రణస్థుల కనకదుర్గ మహంకాళి, ఎంపిపి శ్రీహరి నారాయణరాజు పాల్గొన్నారు.

పాలకోడేరు : పేదల కష్టాన్ని ఎరిగిన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్ అని, రాబోయే రోజుల్లో వైసిపికి అండగా ఉండాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నర్సింహరాజు అన్నారు. వేండ్రలో ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు, ఎంపిపి చంటిరాజుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు, పండ్లు అందజేశారు. అనంతరం పివిఎల్ మాట్లాడారు. అనంతరం మహిళలను ఘనంగా సత్కరించారు. కోరుకొల్లులో రాష్ట్ర అటవీ శాఖ అభివృద్ధి డైరెక్టర్ మంతెన యోగేంద్ర కుమార్(బాబు) ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భారీ కేక్‌ను కట్ చేశారు. వీస్సాకోడేరు రాయిచెట్టు సెంటర్లో సర్పంచి బోల్ల శ్రీనివాస్, మాజీ సర్పంచి పెనుమత్స శ్రీనివాస్‌రాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.



పాలకోడేరు: వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న పివిఎల్, చంటిరాజు



భీమవరం రూరల్ : రక్తదానం చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

ఆచంట : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్వర్ణోత్సవ పుట్టిన రోజు వేడుకలు ఆచంట శ్రీరామేశ్వరస్వామి దేవస్థానం వద్ద వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తనయుడు నరసింహ (నరేష్) రాజు పాల్గొని కేక్‌కట్ చేసి వృద్ధులకు పండ్లు, రొట్టెలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు, గణేశుల శేషవాణి సుబ్బారావు, దిరిశాల విజయలక్ష్మి పాల్గొన్నారు.

కాళ్ల : సిఎం జగన్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. పెదఅమిరంలో జరిగిన రక్తదాన శిబిరానికి మండలంలోని పార్టీ ప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. పలువురు నేతలు రక్తదానం చేశారు.

ప్రాతళ్లమెరక, జువ్వలపాలెం, తదితర గ్రామాల్లో జగన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఏలూరుపాడులో సిఎం పుట్టినరోజు వేడుకలు గ్రామ అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కోనా జోసెఫ్, దాట్ల బాపిరాజు, రంజిత్, చంటి పాల్గొన్నారు.

పెనుమంట్ర : జగన్ పుట్టినరోజు సందర్భంగా పెనుమంట్ర హైస్కూల్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, పోటీల్లో పాల్గొన్న వారికి కన్సలేషన్ బహుమతులను ఉప సర్పంచి భూపతి రాజు వెంకట శ్రీనివాసరాజు ఆర్థిక సహాయంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఎఎంసి ఛైర్మన్ వి.వెంకటరమణ, వైసిపి నాయకులు గాదిరాజు సాయిరామరాజు, తాడిపర్తి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. **ఓడూరులో** విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బుర్రా రవికుమార్, వైసిపి అధ్యక్షులు చిలువూరి హరి వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

నరసాపురం: ప్రజారంజకంగా రాష్ట్రంలో జగన్ పాలన సాగుతోందని పెదలంక (రాజుల్లంక) గ్రామ సర్పంచి వేగేశ్న సీతారామరాజు అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకల్లో సీతారామరాజు పాల్గొని మాట్లాడారు.

పాలకొల్లు రూరల్: సగంచెరువు గ్రామ సచివాలయంలో సర్పంచి కడలి నాగమణి ఆధ్వర్యంలో జగన్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బందితోపాటు, వాలంటీర్లు పాల్గొన్నారు.

తణుకురూరల్ : స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ (అటానమస్)లో ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేయడానికి సిద్ధంగా ఉంటామని విద్యార్థినులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్, లెఫ్టనెంట్ యు.లక్ష్మీసుందరీబాయ్, జి.రమ్య, సిహెచ్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

పెనుగొండ : సిఎం పుట్టినరోజు సందర్భంగా ఎంఎల్ఎ చెరుకువాడ రంగనాథరాజు గాంధీ బొమ్మలు సెంటర్లో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



మొగల్తూరులో..



ఆచంటలో..

విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించి రాష్ట్రంలో రూ.800 కోట్లతో టాబ్‌లు అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కిందని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మార్టేరు ఎస్‌విజిహెచ్ హైస్కూల్ ఆవరణలో నియోజకవర్గ స్థాయిలో తొమ్మిదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం బైజూస్ సంస్థ అందించే టాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాము చదువుకునే వయసులో చదువుకోడానికి డబ్బుల్లేక ఇబ్బంది పడేవారమన్నారు. నేడు జగన్ హయాంలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాల అధిరోహించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడంలో ఆదర్శప్రాయుడన్నారు. అనంతరం జగన్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులతో కేక్‌కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి), ఎంఇఒ డి.శారద జ్యోత్స్న, హైస్కూల్ హెచ్ఎం సిహెచ్ శివజ్యోతి, సర్పంచి మట్టా కుమారి, జెడ్‌పిటిసి సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

గత జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి..

సిఎం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ సమీర్ శర్మ

ప్రజాశక్తి - నరసాపురం

తాను 1987-89లో నరసాపురం సబ్‌కలెక్టర్‌గా పనిచేశానని, గత స్మృతులు గుర్తుకొస్తున్నాయని సిఎం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ సమీర్ శర్మ తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన నరసాపురం విచ్చేశారు. అనంతరం రాత్రి నరసాపురం సబ్ కలెక్టర్ బంగ్లాకు చేరుకున్నారు. ఆయన పని చేసిన కాలంలో నివాసమున్న బంగ్లాను చూసి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తొలుత నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ దంపతులు సిఎం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సమీర్ శర్మకు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి పుష్పగుచ్ఛాలను అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. తనతో పనిచేసిన కొంతమంది విశ్రాంత ఉద్యోగులు అక్కడికి రావడంతో వారిని పలకరించారు. అనంతరం బంగ్లా ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి హిమశైలజ, ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్‌కె ఫిరోజ్, తహశీల్దార్ తహశీల్దార్ సయ్యద్ మౌలాల పజిల్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రయివేటు వ్యక్తి హల్‌చల్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం శ్రీ కనకదుర్గమ్మ వారి దేవాలయాన్ని అప్రతిష్ట పాలు చేస్తున్నారంటూ వీరవాసరం గ్రామానికి చెందిన మద్దాల అప్పారావు దేవాదాయ, ధర్మాదాయ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు బుధవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన దేవస్థానానికి ఏ సంబంధంలేని ప్రయివేటు వ్యక్తి నూకల సత్యనారాయణ (అన్నవరం) అమావాస్య ఘడియల్లో మహిళలను కూర్చోబెట్టి ఎన్నడూ లేని విధంగా అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నాడని తెలిపారు. ఇందుకు సహకరించిన పూజారులను కూడా విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దేవాలయ పూజారులు సైతం సదురు వ్యక్తి చెప్పినట్టు చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని వారిపైనా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఆ వ్యక్తి దేవీ నవరాత్రుల్లో నిర్వహించే అన్నదానాన్ని వ్యాపార కార్యక్రమంగా మార్చి స్వలాభం పొందుతున్నాడని తెలిపారు. దేవాలయాల్లో జరిగే ప్రతి కార్యక్రమం తన చెప్పు చేతల్లో జరగాలని ఆదిపత్యం చెలాయిస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకుని దేవాలయాల ప్రతిష్ట కాపాడాలని అప్పారావు కోరారు.

డిఎన్ఆర్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

24 గంటల్లో సమస్యను పరిష్కరించిన జెడ్‌పి ఛైర్మన్

ప్రజాశక్తి - పాలకొల్లు

మరుగుదొడ్ల పాడవ్వం, అలాగే రోడ్డు పల్లంగా ఉండడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని, సమస్యలను పరిష్కరించాలని దాసరి నారాయణరావు మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌ను కోరారు. విద్యార్థులు అడిగిన 24 గంటల్లోనే జెడ్‌పి ఛైర్మన్ సమస్యను పరిష్కరించారు. బుధవారం మెటీరియల్ తెప్పించి మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే రోడ్డును ఎత్తు చేయించారు. అనంతరం జగన్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థినులు భోజనాలు ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో చందక సత్తిబాబు, అడబాల వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపల్ పి.శోభారాణి పాల్గొన్నారు.



విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న జెడ్‌పి ఛైర్మన్



బాధితులకు సాయం అందజేస్తున్న సభ్యులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

జై శ్రీ భారత్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వీరవల్లి మోహన్ ఇటీవల మృతి చెందారు. వీరవల్లి మోహన్ స్వగ్రామమైన కోపల్లెలో అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో 56 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబానికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సెక్రటరీ తోట రామకృష్ణ నాని మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండేళ్ల నుంచి ఆపదలో ఉన్న సభ్యులకు పది లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో గుండాబత్తుల కోటి ఎర్రంశెట్టి ప్రకాష్, బాలం బలరాం, గెడ్డం సత్తిబాబు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కొడమంచిలిలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఆచంట

ఏసు క్రీస్తు బోధనలను అనుసరించాలని పాస్టర్ గాదిరాజు తిమోతిరాజు అన్నారు. మంగళవారం రాత్రి కొడమంచిలి మార్కెట్ సెంటర్‌లో పాస్టర్ బి.డేవిడ్ రాజు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలో సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ పాల్గొని మాట్లాడారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జాన్‌వెస్లీ, బిషప్ బెనర్జీ, కుంచె ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.

పాలకొల్లు : డిఎన్ఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంఎల్ఎ బాబ్జీ కేక్‌కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఏమతమైన మానవత్వం గురించి చెబుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ రవి శంకర్, ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

టిడిపి జిల్లా సగర సాధికార కమిటీ నియామకం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి జిల్లా సగర సాధికార కమిటీను జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి బుధవారం ప్రకటించారు. జిల్లా కన్వీనర్‌గా ఉండి నియోజకవర్గానికి చెందిన కలవ వెంకట్రావు, కమిటీ కార్యవర్గ సభ్యులుగా తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి యడవల్లి సీతమ్మ, మండలి వెంకటరావు, తణుకు నియోజకవర్గం నుంచి దానుకొండ శేఖర్, నంద్యాల కనకయ్య పాలకొల్లు నియోజకవర్గం నుంచి ఇబ్బ వెంకటేశ్వర్లు, ఇబ్బ రాంబాబు, ఉండి నియోజకవర్గం నుండి ద్రోణాద్రి కనక నరసింహస్వామి, తాటిపర్తి నరసింహస్వామి, క్రాంతి మాధవి, నరసాపురం నియోజకవర్గం నుండి ఇబ్బ ఆదినారాయణ, అచంట నియోజకవర్గం నుండి నెక్కంటి బాపన్న, భీమవరం నియోజకవర్గం నుండ పోత్రు రాంబాబు, నగలం రాముడును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.